# చిగురు

సి.భారతి

***కాలం కలసి రానప్పుడు కమనీయమైన ప్రకృతే వికటించి కాటు వేస్తుంది. కనిపించే దృశ్యాలన్నీ మారిపోతాయి. కానీ ఆ దృశ్యాల్లోంచే ఒక ఆశాకిరణం చిగురించి, బ్రతుకుని దీవించి, బర్ణ్ణకట్లు మంటుంది. ఇది ఓ రకమైన సృష్టి రహస్యం!***

"అమ్మా! మనం సముద్రానికి ఇంత దగ్గరగా ఎందు కున్నాం" అన్నాడు అప్పారావు.

"ఏమో కొడకా! పుట్టిన దాదిగా ఇక్కడే ఉంటున్నాం" అంది లక్ష్మిందేవి.

"ఇప్పుడు ఈ వర్షం చూడు, గుడిసె లోపలంతా ఎలా వస్తోందో! రేడియోలో తుపాను వస్తుందని చెవుతున్నారంట!" అన్నాడు అప్పారావు.

"ఏటి చేద్దామురా అప్పిగా!"

"ఇటువంటి చోట ఉండటం ఏమిటి? సముద్రం పొంగితే మనమంతా ఏమవుతాం?"

"ఎక్క డుంటామురా కొడకా. మనో ళ్ళందరూ ఇక్కడ ఉండటం లేదా? వాళ్ళతో పాటే మనమూ!" అంది లక్ష్మిందేవి.

"ఎక్కడైనా కష్టం చేసుకుని బ్రతకాల్సిందే కదా! ఇక్కడ చేసే కష్టం ఎక్కడైనా చేసుకోవచ్చు కదా!" అన్నాడు అప్పారావు.

"ఏమిటిరా, బాబూ, ను వ్వనేది?" ఆందోళనగా అంది లక్ష్మిందేవి.

"అప్పిగాడు బందరులో ఉండి చదువుతున్నాడు గదే. అక్కడ డాబాలు. బిల్డింగ్‌లు చూసి మనం కూడా అక్కడే ఉండొచ్చని ఆడి ఊహ అయి ఉంటుంది. ఏరా అప్పిగా?" అన్నాడు గుడిసెలో మూలగా పడుకుని ఉన్న మునలయ్య- అప్పిగాడి తండ్రి.

లక్ష్మిందేవి కొడుకు దగ్గరగా వచ్చి బుజంమీద చేయి వేసి లాలనగా - "ఎప్పుడో తుపాను వస్తుందని ఊరు విడిచిపోతామా? కొత్త చోటికి వెళ్తే అక్కడ మనతో ఎవరు పలుకుతారు? పని ఎవ రిస్తారు? అప్పు ఎక్కడ తెచ్చుకుంటాము? నీ చదువు అయిపోయి ఉద్యోగం వస్తే అప్పుడు నీతో మేము కూడా వచ్చేస్తాము. ఈ పది క్లాసుతో చదువు అయిపోయినట్లేనా?" అంది.

అప్పారావు మాట్లాడలేదు. 'ఊరికి ఒక్కడన్నా చదువుకోండిరా' అంటూ ఆ ప్రాంత రాజకీయవాది, చేపలు, రొయ్యల చెరువుల యజమాని సోమసుందరంగారు అప్పారావుని చదివిస్తున్నారు. పదిహేనేళ్ళ అప్పారావు ఇప్పుడిప్పుడే బయట ప్రపంచాన్ని గమనిస్తున్నాడు.

పల్లెల్లో తన ఈడు పిల్లలు ఒంటిని ఒక్క 'గోచి' మాత్రం ధరించి, సముద్రపు ఒడ్డున అలలలో పాచికలాడుతున్నట్లుగా చేపలు పడుతూ ఉంటారు. తనను చూడగానే అందరూ చుట్టుముట్టి తన వంటి నిండుగా ఉన్న బట్టలను ఆశ్చర్యంగా చూస్తారు. తనతో మాట్లాడటం గొప్పగా భావిస్తారు. తన తండ్రంత అదృష్టవంతుడు లేడని తండ్రిని పొగిడేస్తారు. కాని, అప్పారావు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాడు. తన టెన్త్ క్లాసు చదువు బయట ప్రపంచంలో పెద్ద విలువ లేదని, తను బాగా చదివి, మంచి ఉద్యోగంలో చేరి తన వా ళ్ళందరికి మంచి బట్టలు కొనివ్వాలి. అందరికీ చదువు చెప్పించాలి. ఆలోచనలలో ఉన్న అప్పారావు పదేళ్ళ చెల్లెలు సావిత్రి గొంతు విని ఉలిక్కిపడ్డాడు.

సావిత్రి - "అమ్మా నీళ్ళు, అయ్యా నీళ్ళు... లోపలికి వచ్చేత్తున్నాయి" అంటూ భయంగా అరిచింది.

వర్షపు జల్లు లోపలికి కొట్టి గుడినంతా కళ్ళాపి చల్లినట్లయింది.

మునలయ్య లేచి కూర్చుని చుట్ట వెలిగించాడు. లక్ష్మిందేవి కూర్చున్న చోటునుంచి లేచి గుమ్మానికి తడిక గట్టిగా బిగించి కట్టి, కిరసనాయిలు దీపం, అగ్గిపెట్టె దగ్గర పెట్టుకుంది. సావిత్రి నెమ్మదిగా తల్లి దగ్గర చేరింది. కొడుకుని, కూతురిని చెరొక పక్క పెట్టుకుని కూర్చుంది లక్ష్మిందేవి.

బయట వర్షం జోరు పెరిగింది. ఎక్కడో ఉరిమిన చప్పుడుకు సావిత్రి తల్లిని అతుక్కుపోయింది. సాయంకాలం మొదలయిన వాన అంతకంతకూ ఎక్కు వవుతోంది. రాత్రి, పగలు తెలియటంలే లేదు. ఈదురుగాలి క్రమంగా పెరిగి గాలి ఊళవేసిన శబ్దాలు భయం కలిగిస్తున్నాయి. గుడిసె ఊగిపోతోంది.

మునలయ్య చుట్టని ఆర్పేసి మిగిలిన భాగం చెవిలో పెట్టుకుని - "చీకటిగా ఉంది. చిమ్నీ వెలిగించరాదా!" అన్నాడు.

"బుడ్డిలో కిరసనాయిలు కొంచెమే ఉంది. అగ్గిపెట్టె ఇక్కడే ఉందిలే" అంది లక్ష్మిందేవి.

"అమ్మా! ఆకలే" అంది సావిత్రి.

అప్పారావుకి కూడా ఆకలి వేసింది.

లక్ష్మిందేవి, మునలయ్యలకి కూడా ఆకలిగానే ఉంది.

గుడిసె లోపలంతా తడిసిపోయింది. గాలి దూకుడికి ఇంట్లో ఉన్న కొద్ది సామాన్లు చిందరవందరగా పడిపోయాయి.

"ఈ వాన పోకడ చూస్తే రేపు కూడా తగ్గేటట్లుగా లేదు" అన్నాడు మునలయ్య.

"రే పెట్టా తగ్గుతుంది. రే పమాస" అంది లక్ష్మిందేవి.

"నిజమే! నే మర్చిపోయా!" అన్నాడు మునలయ్య.

బయట చీకటి, లోపల చీకటి. ఎంత పొద్దు పోయిందో తెలియటం లేదు. తడిక లోంచి నీళ్ళు చొచ్చుకుని వచ్చేస్తున్నాయి. సముద్రం పొంగుతోందని, గుడిసెల్లోని వాళ్ళు బయటకు రమ్మని కేకలు, అరుపులు వినపడుతున్నాయి.

నిమిషంలో నీళ్ళు మోకాలు లోతుకు వచ్చాయి. తడిక తీసి నలుగురూ బయటకు వచ్చేశారు. గాలి మనుషులను నిలవనీయటం లేదు. నలుగురూ ఒకరి నొకరు గట్టిగా పట్టుకున్నారు. మిగిలిన గుడిసెల్లోని వాళ్ళంతా బయటకు వచ్చి మెరక ప్రాంతం కోసం పరుగులు పెడుతున్నారు. అంతా కేకలు, అరుపులు. ఒకటి, రెండు బాటరీ లైటులు మినుకు మినుకు మంటున్నాయి. నలుగురు యువకులు జట్టుగా చేరి అందరిని లారీల దగ్గరకు పంపుతున్నారు. 'ఇళ్ళు వదలి రావాని' గొడవ పెడుతున్న వాళ్ళని "నీటిలో మునిగి చచ్చిపోతారు. మీ ఇళ్ళు ఎక్కడికీ పోవు" అంటూ బలవంతంగా నచ్చచెప్పి సురక్షిత ప్రాంతాలకి చేరవేయటానికి లారీల దగ్గరకు తీసుకువెళ్తున్నారు.

ఒక యువకుడు మునలయ్య దగ్గరకు వచ్చి - "పద మామా! ఇంక ఆలస్యం చేస్తే బయటపడలేము. బ్రతికుంటే బలుసాకు తినొచ్చు. ఈ ఉప్పెన తగ్గగానే మళ్ళీ వచ్చేస్తాం కదా!" అన్నాడు.

అప్పటికే నీళ్ళు నడుం దాటి వచ్చేశాయి. దూరంగా లారీ హెడ్ లైట్లు మినుకు మినుకు మంటూ వెలుగు నిస్తున్నాయి.


## జూన్‌లో అగ్ని పర్వతాల ప్రేలుళ్ళు

జూన్ మాసానికి, అగ్ని పర్వతాల ప్రేలుళ్ళకు సంబంధం ఉందా? గత 3,477 సంవత్సరాల కాలంలో భూమిపైన, సముద్ర గర్భంలో సంభవించిన అగ్ని పర్వతాల ప్రేలుళ్లను పరిశీలిస్తే, ఇలాగే అనుకోవలసి వస్తుంది. అగ్ని పర్వతాల ప్రేలుళ్లలో అత్యధిక శాతం జూన్ మాసంలోనే సంభవించినట్లు, ఈ నెలలో సంభవించిన ప్రేలుళ్లలోనే అత్యధిక ప్రమాణంలో లావా శక్తి వెలువడినట్లు ఎస్. బెలవ్ అనే రష్యన్ శాస్త్రజ్ఞుని పరిశోధన వల్ల తెలుస్తోంది.

సమ్మెట గోవర్ధన్

నలుగురూ ఒకరి చేయి ఒకరు పట్టుకుని ముందుకు నడుస్తూ లారీ దరిదాపులకు వచ్చేశారు.

చుట్టూ అంధకారం. ఏడతెగని వర్షం.



హోరుగాలి, చెట్లు విరిగిన చప్పుళ్ళు, ఇళ్ళు కూలుతున్న ఫెళ ఫెళా రావాలు, పిల్లల ఏడుపులు, పెద్దల నిశ్శబ్ద రోదన, మూగజీవాల గోడు. భీకర ప్రకృతి ముందు సృష్టి సమస్తం అసహాయ ఆక్రందన చేస్తోంది.

"త్వరగా రండి. నీళ్ళు బాగా వచ్చేస్తున్నాయి. సముద్రం పొంగుతోంది!" లారీ డ్రైవరు తొందర పెడుతున్నాడు.

తల్లి చేయి పట్టుకుని నడుస్తున్న సావిత్రిని 'గాలి' ఒక్క ఊపు ఊపింది. తల్లి పట్టునుంచి పిల్ల వడిపోయింది.

"అయ్యో సావిత్రీ, బిడ్డా!" గట్టిగా అరిచింది లక్ష్మిందేవి.

తల్లి ఆక్రందన విని చెల్లెలికోసం తల్లి చేయి వదలి చీకటిలో చేతితో తడిమిలాడాడు అప్పారావు.

అప్రయత్నంగా భర్త చెయ్యి పట్టుకుంది లక్ష్మిందేవి. తలలోతు నీళ్ళలో గాలి విసురికి, ప్రవాహ వేగానికి, కొట్టుకుపోయి క్షణంలో కనుమరుగయ్యారు సావిత్రి, అప్పారావు.

కడుపు వగిలిపోయింది. ఇలాంటి దుఃఖం కలగకూడదనే పెద్దవాళ్ళు చిన్నవాళ్ళని అమ్మ కడుపు చల్లగా అంటూ దీవిస్తారు.

లారీ దగ్గర చేరిన పల్లెవానులు, లారీ డ్రైవరుతో సహా అంతా నిశ్చేష్టు లయ్యారు.

** ** **

పది రోజులు గడిచిపోయాయి. ప్రకృతి చేసిన విలయతాండవం రెండు రోజులే అయినా, ఆ. ఆవేశ చిహ్నాలు ఎక్కడ చూచినా కనిపిస్తున్నాయి. మెరక ప్రాంతాలకు రక్షణ కోసం వెళ్ళిన వాళ్ళంతా స్వస్థలాలకు చేరుకున్నారు. ప్రకృతి చేతిలో అందరూ పావు లయ్యారు. ఉన్నవాడు, లేనివాడు అంత ఒకే స్థితిలో మిగిలారు.

నిన్నటివరకు తమకు అండగా నిలబడిన లక్షాధికారి సోమసుందరంగారు దీనంగా కాలినడకన పల్లె చేరుకున్నారు. మునలయ్య, లక్ష్మిందేవి దగ్గరకు ఓదార్చటానికి వచ్చారు. పల్లె అంతా అక్కడ చేరి కటిక నేలమీద కూర్చున్నారు. ఎవరికీ నోట మాట రావటం లేదు. అంతా శూన్యం. ఎటువంటి ఆశా కనబడటం లేదు. ఎక్కడ చూసినా తలలు విరిగిన కొబ్బరిచెట్లు, తాటిచెట్లు, పడిపోయిన ఇళ్ళు, కొట్టుకుపోయిన పాకలు, ఇసుక మేట వేసిన ఊళ్ళు, ఉప్పు నిండిన చేలు.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఒక మునలమ్మ పసిగుడ్డును తీసుకువచ్చి "బాబూ! మనవరాలు పుట్టింది" అంది సోమసుందరంగారితో.

"నీ మనవరాలు ఏమి తిని బతుకుతుందే మునలిదానా!" అన్నారు సోమసుందరంగారు, చుట్టూ ఉన్న భూమిని విచారంగా చూస్తూ.

"ఎందుకు 'బాబూ' అంత బెంగ పెట్టుకుంటారు. ఇటు చూడండి, ఈ మొక్క తుపాను తాకిడికి ఎండిపోయింది. నేను చచ్చిపోయిందే అనుకున్నాను. కాని ఇటు చూడండి. నన్నటి 'చిగురు' బయటకు వస్తోంది. ఎంత నేవళంగా ఉందో చూశారా?" అంది ఓదార్పుగా.

ఎండిపోతున్న మొక్కకి చిగురు రావటం అందరూ వింతగా, ఆనందంగా చూశారు. అందరి మొహాల్లో సంతోషం కదలాడింది. గుంపులో ఒకరు లక్ష్మిందేవికి, మునలయ్యకి అన్నం ముద్దలు కలిపి బ్రతిమాలి బలవంతంగా తినిపిస్తున్నారు. ★